సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 18 । మార్చి । 2024



సోమశిలలో 12.266 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 12.266 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 2,460 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,540
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,065
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,247
నవర (8 గ్రాములు)	రూ.49,976

గరిష్టం/కనిష్టం
34.1 /26.0

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 71 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. సోమవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.



న్యూస్‌రీల్

నేటి నుంచి ఒంటిపూట బడులు

నెల్లూరు(టౌన్): ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని డీఈఓ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏపీపీఎస్సీ పరీక్ష కేంద్రాల పరిశీలన

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో జరుగుతున్న ఏపీపీఎస్సీ గ్రూప్–1 స్క్రీనింగ్ టెస్ట్ కేంద్రాలను ఏపీపీఎస్సీ సభ్యురాలు డాక్టర్ బీఎస్ సెలీనా, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదివారం పరిశీలించారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను వారు తనిఖీ చేశారు. కాగా జిల్లాలో మొత్తం 13 పరీక్ష కేంద్రాల్లో స్క్రీనింగ్ టెస్ట్‌కు 6,955 మంది హాజరుకావాల్సి ఉండగా, మొదటి పేపర్‌కు 4,236 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో పేపర్‌కు 4,196 మంది హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు.

పటిష్ట బందోబస్తు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో గ్రూప్–1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రూప్–1 రాత పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు తెలిపారు. నెల్లూరులోని వీఆర్‌పీజీ కళాశాల, ట్రెజరీ, శ్రీచైతన్య జూనియర్ కాలేజీ, ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల తదితర కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సౌజన్య పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- జిల్లా అబ్జర్వర్ రామలింగం



మాట్లాడుతున్న మువ్వా రామలింగం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జేడీ సర్వీసెస్, జిల్లా అబ్జర్వర్ మువ్వా రామలింగం తెలిపారు. ఆదివారం స్థానిక పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్‌లు, పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి ఎవరికీ సెల్‌ఫోన్ అనుమతి లేదని, విద్యార్థులను పరిశీలించిన తరువాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని పరీక్షలను సజావుగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈఓ పీవీజే రామారావు, డిప్యూటీ ఈఓలు పాల్గొన్నారు.

వలస నేతలకు రెడ్ కార్పెట్

వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు అని పేరుంది. పార్టీ జెండా మోసిన సీనియర్ నేతలందరినీ ఎన్నికల సమయం వచ్చేసరికి పక్కన పెట్టి వలస నేతలకు టికెట్లు ఇవ్వడం ఆయన నైజమని ప్రస్తుతం ప్రకటించిన టీడీపీ అభ్యర్థుల జాబితా చూస్తే అర్థమవుతోంది. జిల్లాలో టీడీపీ సీట్లు పొందిన వారిలో దాదాపుగా వలస నేతలే ఉండడంపై ఆ పార్టీ కేడర్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

టీడీపీ జెండా మోసిన వారికి వెన్నుపోటు

- చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థులందరూ దాదాపుగా వలస నేతలే
- వేమిరెడ్డి కుటుంబానికి రెండు సీట్లు
- పోలంరెడ్డికి పొగబెట్టిన చంద్రబాబు
- పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డికీ హుళక్కే
- సీనియర్లకు దక్కని సీట్లు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబును నమ్ముకుని రాజకీయంగా ఎదిగిన నేతలు ఎవరైనా ఉన్నారా అంటే టార్చిలైట్ వేసి వెతికినా లేరనే చెప్పొచ్చు. తమ పలుకుబడితో గెలవగలిగే సత్తా ఉన్న నేతలను ఆయన ఎప్పుడూ ఎదగనివ్వలేదనేది చరిత్ర. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడినా.. అందలం ఎక్కే అవకాశాల్లో చివరికి వారు కరివేపాకుగా మారుతున్నారు. తాజాగా ఆత్మకూరు, కోవూరు, కావలి, ఉదయగిరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఆ పార్టీ నేతల పరిస్థితి ఇలాగే తయారైంది. తన రాజకీయ అవసరాల కోసం జిల్లాలో ఆ పార్టీ సీనియర్ నేతలకు వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబుకే దక్కిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

తప్పని భంగపాటు

కోవూరులో ఇప్పటికే పలు దఫాలుగా చివరి దశలో టికెట్ చేజారిన నేతల్లో పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ఒకరు. ఇక్కడ టికెట్ ఆశిస్తున్న పార్టీ సీనియర్ నేత చేజర్ల వెంకటేశ్వర రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కుటుంబానికి కూడా భంగపాటు తప్పలేదు. ఆ ముగ్గురిని పూచికపుల్లల్లా తీసేసిన చంద్రబాబు పార్టీ టికెట్‌ను డబ్బు సంచులకు అమ్మేశారు. వలస నేత వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆ సీటును సమర్పించారు.

సీనియర్లకు వెన్నుపోటు

జిల్లాలో టీడీపీ టికెట్ ఆశించిన ఆ పార్టీ సీనియర్ నేతలందరూ కరివేపాకులుగా మారారు. ఆత్మకూరు నియోజకవర్గంలో బలమైన నేతగా ఎదిగిన నేతల్లో కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఒకరు. టీడీపీ అభ్యర్థిగా ఒక దఫా గెలిచిన కొమ్మికి గడిచిన రెండు దఫాల ఎన్నికల్లో టికెట్ తనకే అంటూ చంద్రబాబు చివరికి మొండిచేయి చూపారు. అలాగే దాదాపు రెండు దశాబ్దాలుగా టీడీపీలో టికెట్ కోసం ఎదురుచూస్తున్న సీనియర్ నేత గూటూరు కన్నబాబుకు కూడా ప్రతిసారీ వెన్నుపోటు తప్పడం లేదు. అంతేకాకుండా నాలుగేళ్లుగా ఆత్మకూరుకు ఇన్‌చార్జిగా నియమించే సాహసం కూడా ఆ పార్టీ అధిష్టానం చేయలేదు. వలస నేతగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డికి చంద్రబాబు సీటు ఖరారు చేశారు.

సిటీ, రూరల్‌లో మొండిచేయి

నెల్లూరు సిటీ నియోజకవర్గాన్ని పరిశీలిస్తే.. అక్కడ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఎన్నికలకు ఏడాది వరకు సీటు తనదేనని నమ్మించారు. ఎన్నికల వేళ మొండిచేయి చూపారు. నెల్లూరు రూరల్‌లో ఆ పార్టీ టికెట్ ఆశావహుడైన అబ్దుల్ అజీజ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించి ఐదేళ్లపాటు తమ అవసరాల కోసం ఉపయోగించుకున్నారు. తన ప్రత్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో అబ్దుల్ అజీజ్ అష్టకష్టాలు పడ్డారు. కానీ పార్టీ ఫిరాయించిన శ్రీధర్‌రెడ్డి పేరును తొలి జాబితాలోనే ప్రకటించి అజీజ్‌కు పొగబెట్టారు.

సీటు అమ్మేశారు

కావలి నియోజకవర్గంలో చూస్తే టీడీపీని నమ్ముకుని ఎన్నికల బరిలోకి దిగిన కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డికి ఆ పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచారని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆలస్యంగా గ్రహించిన కాటంరెడ్డి పార్టీకి కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. ఇదే నియోజకవర్గానికి చెందిన బీద రవిచంద్ర, మాలేపాటి సుబ్బానాయుడు ఈ దఫా ఎన్నికల్లో టికెట్ వస్తుందని చంద్రబాబును నమ్మి నట్టేట మునిగిపోయారు. కావలిలో కూడా డబ్బు సంచులకే ప్రాధాన్యం ఇచ్చి వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన కావ్య కృష్ణారెడ్డి సీటు అమ్మేశారు.

క్యాడర్ ఆగ్రహం

రాజకీయాల్లో తనకు 40 ఏళ్ల అనుభవం ఉందని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు పార్టీని నమ్ముకున్న వారిని, కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన వారిని కాదని ఎన్నికల వేళ డబ్బు సంచులతో వచ్చిన వలస నేతలకు రెడ్ కార్పెట్ వేసి సీట్లు ఇవ్వడంపై టీడీపీ క్యాడర్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు టీడీపీ ప్రకటించిన అభ్యర్థుల్లో దాదాపుగా వలస నేతలే కావడం గమనార్హం. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే సీట్లు ఇవ్వడాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. నిజమైన టీడీపీ నేతలకు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదా.. అని క్యాడర్ అధిష్టానాన్ని ప్రశ్నిస్తోంది. జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత సైతం టీడీపీలో డబ్బు సంచుల హవానే పనిచేస్తుందని, సీనియారిటీ ఉన్నా డబ్బు లేదనే సాకుతో పార్టీ టికెట్ ఇవ్వడం లేదని తన అంతరంగీకుల వద్ద వాపోయినట్లు తెలిసింది.

ఆశలు ఆవిరై..

ఉదయగిరి నియోజకవర్గ పరిస్థితిని పరిశీలిస్తే మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావుతోపాటు మరో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, బీసీ నేత చెంచలబాబుయాదవ్, వలస ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. అయితే డబ్బు సంచులతో వచ్చిన ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కే చంద్రబాబు సీటిచ్చేశారు. ఇక సర్వేపల్లిలో ప్రజాదరణ కోల్పోయిన సోమిరెడ్డి ఇప్పటికే ఐదు దఫాలుగా ఓటమి పాలయ్యారు. వరుసగా ఓటమి పాలైన నేతలకు ఈ దఫా టికెట్ ఇవ్వడం కుదరదని లోకేశ్ తెగేసి చెప్పిన నేపథ్యంలో ఈ ఎన్నికల్లో ఇక్కడ కొత్త ముఖం వస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే టీడీపీ అధిష్టానం రెండు దఫాలు తమ పార్టీ జాబితాలను ప్రకటించినా సీనియర్ నేత సోమిరెడ్డి పేరు వాటిలో లేకపోవడంతో ఆయన మొండిచేయి తప్పదని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఇక కందుకూరులో ఇంటూరు బ్రదర్స్ ఇద్దరూ టికెట్ కోసం పోటీ పడినా చివరకు ఇంటూరు నాగేశ్వరరావుకే సీటు దక్కింది.

నేటి నుంచి పది పరీక్షలు

- హాజరుకానున్న 32,746 మంది విద్యార్థులు
- 176 కేంద్రాల్లో పరీక్షలు
- 9 ఫ్లయింగ్, 25 సిటింగ్ స్క్వాడ్‌లు
- 2,300 మంది ఇన్విజిలేటర్లు
- సమస్యల పరిష్కారం కోసం కంట్రోలు రూం ఏర్పాటు
- ఆర్టీసీలో విద్యార్థులకు ఉచిత ప్రయాణం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. ప్రశ్నపత్రాలను 48 స్టోరేజీ పాయింట్లలో పోలీసుల పహారా మధ్య భద్రపరిచారు. పది పరీక్షలు జిల్లావ్యాప్తంగా మొత్తం 176 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్ష సమయానికి గంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. గంట ముందుగానే కేంద్రంలోకి అనుమతించనున్నారు. సరైన కారణం చూపినట్లయితే రెండు, మూడు నిమిషాలు ఆలస్యమైనా కేంద్రంలోని విద్యార్థులను అనుమతించనున్నారు. పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షకు హాజరయ్యే వీలు కల్పించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూం నంబర్ 8314108109ను అందుబాటులో ఉంచారు. ప్రశ్నపత్రం మీద బార్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రం పరీక్ష సమయంలో బయటకు వచ్చినట్లయితే బార్‌కోడ్ స్కాన్ చేసి విద్యార్థి, సెంటర్ వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. యాక్ట్ 25/1997 ప్రకారం సంబంధిత వ్యక్తులకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రామారావు

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షల కోసం 176 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 176 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ఈ పరీక్షలకు 2,300 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. 9 ఫ్లయింగ్, 25 సిటింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా అబ్జర్వర్‌గా మువ్వా రామలింగంను నియమించారు. పరీక్ష కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు, ఆన్‌లైన్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద మెడికల్ కిట్‌తోపాటు ఏఎన్ఎం ఉండేలా చర్యలు తీసుకున్నారు. తాగునీరు, రన్నింగ్ వాటర్, సరిపడా టాయ్‌లెట్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు.

32,746 మంది విద్యార్థుల హాజరు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా మొత్తం 32,746 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 28,080 మంది రెగ్యులర్, 4,666 మంది ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో 7 సమస్యాత్మక కేంద్రాల(సీతారామపురం, నారాయణరెడ్డిపేట, కలువాయి ఏ, బీ సెంటర్లు, సౌత్‌మోపూరు, మర్రిపాడు, రేవూరు)ను గుర్తించారు. వీటిలో 4 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ పరీక్షలు జంబ్లింగ్ పద్ధతిలో జరగనున్నాయి.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు జిల్లావ్యాప్తంగా 30 కేంద్రాల్లో జరగనున్నాయి. పదికి సంబంధించి 11, ఇంటర్‌కు సంబంధించి 19 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. పదో తరగతి పరీక్షలకు 1,713 మంది, ఇంటర్‌కు 3,591 మంది కలిపి మొత్తం 5,304 మంది హాజరుకానున్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఉండేందుకు 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పది రెగ్యులర్ పరీక్షలకు సంబంధించి నిమయ, నిబంధనలు అమలు కానున్నాయి. రెగ్యులర్ పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి తరగతులు నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం యథావిధిగా విద్యార్థులకు అందించనున్నారు. రెగ్యులర్, ఓపెన్ పరీక్షలు జరిగే పాఠశాలలకు సెలవులు ఇవ్వనున్నారు. పరీక్షల అనంతరం రెండో శనివారం, ఆదివారాల్లో ఈ పాఠశాలల్లో తరగతులు నిర్వహించనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

పది పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. తల్లిదండ్రులు విద్యార్థులను ఒత్తిడికి గురిచేయకూడదు. కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాం. విద్యార్థికి ఏ సమస్య ఉన్నా కంట్రోల్ రూం నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరిస్తాం. విద్యార్థులకు ఆల్ ది బెస్ట్.

– పీవీజే రామారావు, డీఈఓ

సంక్షేమ సారథి వెంట నడిచేందుకు అందరూ సిద్ధం



పార్టీలో చేరిన వారితో ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సంక్షేమ సారథి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని మేకపాటి నివాసంలో ఎంపీ విజయసాయిరెడ్డి సమక్షంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీలో చేరారు. సంగం మండల వైఎస్సార్‌సీపీ నేతలు పులగం శంకర్‌రెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, మధురెడ్డి, పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, తుంగా ఇందూధర్‌రెడ్డి, ముడి మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పెరమనకు చెందిన మాజీ సర్పంచ్ ఇనగంటి బసిరెడ్డి, డేగా మధుసూదనయ్య, పాశం శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీలో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కులరెడ్డి అంకిరెడ్డి, బట్రెడ్డి జనార్దనరెడ్డి, గుడిగుంట నాయకుడు భాస్కర్ ఆధ్వర్యంలో అనంతసాగరం మండలం చిలకలమర్రికి చెందిన దొమ్మరాజు సురేందర్‌రాజు, డి.హేమంత్‌రాజు, బి.దొరబాబు, ఎం.మల్లికార్జున, సీహెచ్ సాయి, ఎం.సురేష్, ఎం.హరీష్ తదితరులు పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచితస్థానం కల్పిస్తామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు.

రాజమోహన్‌రెడ్డితో విజయసాయిరెడ్డి భేటీ



రాజమోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి తదితర నాయకులతో సమావేశమైన విజయసాయిరెడ్డి

నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో ఆయన నివాసంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి ఆదివారం భేటీ అయ్యారు. రానున్న ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులతో ఎన్నికలకు సంబంధించి అనేక విషయాలపై చర్చించారు.

ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఉందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. నగరంలోని విజయమహల్ రైల్వేగేటు వద్ద గల ఎస్‌సీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం నగర ఆర్యవైశ్య వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్య అభినందన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు మన జిల్లాకు చెందిన వ్యక్తి కావడం గర్వకారణమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆర్యవైశ్యులను ఎంతో అభిమానిస్తారని తెలిపారు. సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి విజయసాయిరెడ్డిని, నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు మొదటి నుంచి వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులకు పలు పదవులు కేటాయించి సముచితస్థానం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యాపారులు ఎప్పుడూ ఇబ్బందులు పడలేదని, రానున్న ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ల అధ్యక్షులను, ఆలయ చైర్మన్లను, పలు క్లబ్‌లకు సంబంధించిన ఆర్యవైశ్య ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొగ్గళ్లపల్లి కామాక్షిదేవి, వేలూరు మహేష్, కిన్నెర ప్రేమ్‌కుమార్, కల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ చందోలు సతీష్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పోతూరు సాయి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు చీదెళ్ల కిషన్, నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, రావూరి జగన్, మంచికంటి శ్యామ్, పిండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



అభినందన సభలో అతిథులను సన్మానిస్తున్న నాయకులు

19 నుంచి ప్రసన్నుని వార్షిక బ్రహ్మోత్సవాలు

- మహావిష్ణువు పాదం మోపిన బిలకూట క్షేత్రంలో వేడుకలు

బిట్రగుంట: మహా విష్ణువు పాదం మోపిన ప్రదేశం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో మంగళవారం నుంచి ప్రసన్నుని వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. క్షేత్రవాసి ప్రసన్న వెంకటేశ్వరస్వామికి వైఖానస ఆగమ శాస్త్రానుసారం ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు స్వామివారికి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలివస్తారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

బిలకూట క్షేత్రంలో జరగనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. భక్తుల కోసం చలువ పందిళ్లు, చలివేంద్రాలు సిద్ధమవుతున్నాయి. దేవేరులతో కూడిన స్వామివారి విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు మెరుగుపరిచారు. భక్తుల భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు.



ప్రసన్న వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

బ్రహ్మోత్సవాల వివరాలు

మార్చి 19వ తేదీన గిరిప్రదక్షిణ, అంకురార్పణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 20వ తేదీన తిరుమంజనం, ధ్వజారోహణ (కొడిముద్దలు), శేషవాహన సేవ, 21న హనుమంతసేవ, 22న ఉదయం మోహినీ ఉత్సవం, రాత్రికి గరుడసేవ, 23వ తేదీన ఉదయం మొక్కుబడులు, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి గజవాహనసేవ, 24న ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి అశ్వవాహన సేవ, 25న సాయంత్రం పుష్పయాగం, రాత్రికి ఏకాంతసేవతో ఉత్సవాలు పూర్తవుతాయి. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కాగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రచారంపై దేవదాయశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

టీ-20 క్రికెట్ లీగ్ విజేత ఎన్‌యూసీసీ జట్టు



ఎన్‌యూసీసీ జట్టుతో అతిథులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ పీవీ రమణ మెమోరియల్ జిల్లాస్థాయి టీ-20 క్రికెట్ లీగ్ విజేతగా ఎన్‌యూసీసీ జట్టు నిలిచింది. బుజబుజనెల్లూరులోని సీఏపీ క్రికెట్ మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎన్‌యూసీసీ, లార్డ్స్ క్లబ్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగుకు దిగిన లార్డ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 133 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగుకు దిగిన ఎన్‌యూసీసీ జట్టు 6 వికెట్ల నష్టానికి 137 పరుగులు సాధించి 4 వికెట్ల తేడాతో విజేతగా నిలిచింది. లార్డ్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ఏసీఏ ఎస్‌జీఎం ఎస్కే ఖాజామొహిద్దీన్, ఎన్‌డీసీఏ కోశాధికారి అబూబకర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై షీల్డ్‌లు అందజేశారు. సీనియర్ క్రీడాకారులు భానుప్రకాష్‌రెడ్డి, వెంకన్న, కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో తెగిపడిన విద్యుత్ తీగ

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగి ట్రాక్‌పై పడింది. ఆ సమయంలో రైళ్ల రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్‌వైరు తెగిపడిన విషయం తెలుసుకున్న ప్రయాణికులు కొంత ఆందోళన చెందారు. తక్షణమే స్పందించిన రైల్వే సిబ్బంది మరమ్మతులు చేపట్టి యథావిధిగా రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా జమ్ముతావి ఎక్స్‌ప్రెస్, కోరమాండల్ రైళ్లు గంట ఆలస్యంగా నడిచాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



గుర్తుతెలియని మృతదేహం

సంగం: మండల పరిధిలోని బీరాపేరు సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి(57) మృతి చెందాడు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని సంగం వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎగిరి రోడ్డు మార్జిన్‌లో పడిపోయి మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు మృతదేహాన్ని గమనించి సంగం పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


దువ్వూరు కాలువలో జారిపడి వ్యక్తి మృతి



కాలువలో వెంకటేశ్వర్లు మృతదేహం


సంగం: స్థానిక దువ్వూరు కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..సంగంలోని పాతూరుకు చెందిన సూరాయపాళెం వెంకటేశ్వర్లు (55) బహిర్భూమికి దువ్వూరు కాలువ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి మృతి చెందాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. సాయంత్రం దువ్వూరు కాలువలో మృతదేహం తేలుతుండడాన్ని గమనించిన స్థానికులు సంగం పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడు సూరాయపాళెం వెంకటేశ్వర్లుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 118
లేయర్ (లైవ్)	: 73
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 125

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.70
పండ్లు	: రూ.25

రాజకీయ చరిత్రను తిరగరాసిన వైఎస్సార్‌సీపీ

- కందుకూరులో 1989 తరువాత మళ్లీ బీసీకి అవకాశం
- యాదవ సామాజిక వర్గానికి చెందిన బుర్రాకు టికెట్
- మరోసారి కమ్మ సామాజిక వర్గానికే టీడీపీ ప్రాధాన్యం



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా

కందుకూరు: కందుకూరు నియోజకవర్గ రాజకీయ చరిత్రను వైఎస్సార్‌సీపీ పూర్తిగా తిరగరాసింది. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి రాజకీయంలో సంచలనాలకు తెరలేపింది. అదే కోవలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సరికొత్త రాజకీయాలకు నాంది పలికింది. కందుకూరు నుంచి దశాబ్దాలుగా రెండు సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులే పోటీ పడుతుండగా ఆ సంప్రదాయాన్ని తిరగరాసింది. తొలిసారి వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో నూతన శకాన్ని మొదలుపెట్టింది. 1951లో కందుకూరు నియోజకవర్గం ఏర్పడింది. ఆ తరువాత నుంచి 2019 ఎన్నికల వరకు మొత్తం పదిహేనుసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అందులో ఒక్కసారి మినహా మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ రెండు సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు మాత్రమే పోటీ పడుతూ వస్తున్నారు. అది కూడా రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులే ప్రధానంగా నియోజకవర్గ రాజకీయాన్ని శాసించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో మాత్రమే టీడీపీ తరుపున తొలిసారి బీసీ అభ్యర్థి మోరుబోయిన మాలకొండయ్య పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మళ్లీ అప్పటి నుంచి 2019 వరకు కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్నారు. ఈ రాజకీయ చరిత్రను తిరగరాసే నిర్ణయాన్ని ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అధిష్టానం తీసుకుంది. శనివారం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో కందుకూరు నియోజకవర్గం నుంచి బీసీ(యాదవ) వర్గానికి చెందిన బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు అవకాశం కల్పించింది. దీంతో దాదాపు 8 దశాబ్దాల కందుకూరు రాజకీయ చరిత్రలో రెండోసారి బీసీ అభ్యర్థిగా బుర్రా మధుసూదన్‌యాదవ్ ఎన్నికల బరిలో నిలవనున్నారు. కాగా టీడీపీ మాత్రం తన పాత సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మరోసారి కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఇంటూరి నాగేశ్వరరావును ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది.

కందుకూరు నుంచే రాజకీయ ప్రస్థానం

ఎటువంటి రాజకీయ నేపథ్యం లేనటువంటి కుటుంబం నుంచి బుర్రా మధుసూదన్ యాదవ్ తన రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టారు. కందుకూరు మండలం కంచరగుంటకు చెందిన బుర్రా రియల్ ఎస్టేట్ వ్యాపారిగా స్థిరపడ్డారు. 2012లో వైఎస్సార్ సీపీలో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2012 నుంచి 2014 వరకు పార్టీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేశారు. అయితే అప్పట్లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 2014 ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో దాదాపు 40వేలకు పైగా ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించి ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేగా కనిగిరి నియోజకవర్గంలో తనదైన ముద్ర వేశారు. ప్రస్తుతం మరోసారి మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో కందుకూరు నుంచే ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఎక్కడైతే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారో అదే నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో తలపడనున్నారు. వైఎస్సార్‌సీపీ అండతో రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బుర్రా తన సొంత నియోజకవర్గమైన కందుకూరులో వెనుకబడిన వర్గ అభ్యర్థిగా తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు.

సంతోషం వ్యక్తం చేస్తున్న బీసీలు

కందుకూరు రాజకీయ ముఖ చిత్రాన్ని మారుస్తూ బీసీ వర్గానికి చెందిన బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడంపై నియోజకవర్గంలోని బీసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 8 దశాబ్దాల నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయని సాహసాన్ని వైఎస్సార్‌సీపీ చేసిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీల పట్ల నిబద్ధతకు ఇది ఒక నిదర్శనమని విశ్లేషిస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 80వేల మంది ఓటర్లు బీసీలు ఉన్నారు. వారంతా ఏకతాటిపైకి వచ్చి బీసీ వర్గానికి చెందిన బుర్రాకు అండగా ఉంటామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయంతో వచ్చే ఎన్నికల తరువాత నియోజకవర్గ రాజకీయంలో సరికొత్త శకం ప్రారంభం కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

దోపిడీ దొంగల బీభత్సం

- అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించి దంపతులపై మారణాయుధాలతో హత్యాయత్నం
- డబ్బులు, బీరువా తాళాలు ఇవ్వాలని చిత్రహింసలు
- వేకువజామున 4.30 గంటల వరకు ఇంట్లోనే తిష్ట
- కుమారుడ్ని కిడ్నాప్ చేస్తాం.. రూ.కోటి ఇవ్వాలంటూ బెదిరింపులు



బాధితులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కందుకూరు: నిత్యం జన సంచారం, వాహనాల రద్దీ ఉండే కందుకూరు మెయిన్ రోడ్డులో పట్టణ నడిబొడ్డున దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. నిద్రిస్తున్న దంపతులపై మారణాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడడమే కాక దొరికిన కాడికి నగదుతో ఉడాయించారు. ఈ ఘటన పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న స్వర్ణాప్యాలెస్ లాడ్జి సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శివరామకృష్ణ, వినీల దంపతులు కుమారుడు మోక్షజ్ఞతో కలిసి కనిగిరి రోడ్డులోని రెండస్తుల బిల్డింగ్‌లో పైపోర్షన్‌లో నివాసం ఉంటున్నారు. కింది పోర్షన్‌లో పాన్‌షాపుతో పాటు శివరామకృష్ణ తాకట్టు వ్యాపారం నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఇంట్లో కరెంట్ పోవడంతో శివరామకృష్ణ తలుపు తీసి బయటకొచ్చారు. ఆ వెంటనే ముసుగులు ధరించిన నలుగురు దుండగులు అకస్మాత్తుగా ఇంట్లోకి ప్రవేశించారు. వచ్చిన వెంటనే కర్రలు, కత్తులతో దంపతులపై దాడికి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న నగదు, నగలు ఇవ్వాలని, బీరువా, లాకర్ తాళాలు ఇవ్వాలంటూ నానా హంగామా సృష్టించారు. దీంతో భయభ్రాంతులకు గురైన దంపతులు కప్‌బోర్డులో రూ.50 వేలు ఉన్నాయని చెప్పగా ఆ నగదు తీసుకున్నారు. అలాగే వినీల తన ఒంటిపై ఉన్న గాజులు, నగలు, నల్లపూసల దండ తీసి దొంగల చేతిలో పెట్టారు. అయితే అవి రోల్డ్‌గోల్డ్‌గా భావించిన దొంగలు వాటిని తీసుకునేందుకు నిరాకరించి నేలకేసి కొట్టారు. ఇంట్లో ఉన్న డబ్బులు, బంగారం ఇవ్వాలంటూ నానాయాగీ చేశారు. దీంతో భయభ్రాంతులకు గురైన వారు ప్రస్తుతం ఇంట్లో ఏమీ లేవని, ఉన్న మొత్తం మీకే ఇచ్చామంటూ ప్రాధేయపడ్డారు. ఈ సమాధానంతో సంతృప్తి చెందని దొంగలు మోక్షజ్ఞను కిడ్నాప్ చేసి తమ వెంట తీసుకెళ్తామని, వెంటనే రూ.కోటి తీసుకొచ్చి విడిపించుకెళ్లాలని భయపెట్టారు. శివరామకృష్ణ తమకు అంత స్తోమత లేదని, తమ కుమారుడిని తీసుకెళ్లేందుకు వీల్లేదని దొంగలకు అడ్డుపడగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో శివరామకృష్ణ చేతికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. చివరకు దంపతుల వేడుకోలుకు దిగొచ్చిన దొంగలు కుమారుడ్ని విడిచిపెట్టేందుకు అంగీకరించి దొరికిన రూ.50 వేల నగదుతో పారిపోయారు.

రెండు గంటల పాటు ఇంట్లోనే..

మెయిన్ రోడ్డులో నిత్యం వాహనాలు, జనాల రద్దీ ఉండే ప్రాంతంలో దొంగలు ఏకంగా ఓ ఇంట్లోకి చొరబడి రెండు గంటల పాటు గడిపి బీభత్సం సృష్టించడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. పక్కాప్లాన్‌తో వచ్చిన దొంగలు మెట్లకు ఉండే డోర్‌ను తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. ముందుగా ఫ్యూజులు తొలగించి విద్యుత్ కట్ చేశారు. అనంతరం ఇంట్లోకి చొరబడి సెల్‌ఫోన్లు లాక్కుని సిమ్‌లు తీసివేశారు. ఇంట్లో ఏ అలజడి జరిగినా వెంటనే రోడ్డు మీద వెళ్లే వారికి వినిపిస్తుంది. కానీ దొంగలు దంపతులు అరవకుండా తీవ్రంగా కొట్టి భయపెట్టారు. వినీల చెవిని కత్తితో కోశారు. బాలుడిపైన కర్రతో దాడి చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం

ఈ ఘటనపై ఉదయాన్నే సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నఫీజ్‌బాషా తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. దొంగలు ఏవిధంగా ఇంట్లోకి వచ్చారు.. వారు ఎలా ప్రవర్తించారు.. దాడి చేయడానికి ఏఏ ఆయుధాలు ఉపయోగించారు తదితర సమాచారాన్ని సేకరించారు. అలాగే క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ ఇంటిని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, వీలైనంత త్వరగా దొంగలను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. దొంగల దాడిలో గాయపడిన శివరామకృష్ణ దంపతులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా దొంగల దాడిలో గాయపడిన శివరామకృష్ణ, వినీల దంపతులను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పరామర్శించారు.

జగనన్న ప్రభుత్వంలో గణనీయమైన అభివృద్ధి

- రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్లతో సుస్థిర ప్రగతి
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను మత్స్యకారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కావలి నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కావలి మండలం గౌరవరం నుంచి బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్ వరకు పర్యటించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివిధ వర్గాల ప్రజలు, రైతులు, మత్స్యకారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి కొత్తపుంతలు తొక్కడం ప్రారంభమైందన్నారు. కావలి ఎమ్మెల్యేగా వరుసగా రెండుసార్లు తనను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా జగనన్న కావలి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చొరవచూపారన్నారు. దశాబ్దాలుగా కలగా మిగిలిపోయిన రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలను సాకారం చేశారన్నారు. దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారన్నారు. పారిశ్రామిక కారిడార్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు. పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మరింత అభివృద్ధికి ఆస్కారం కల్పించాలన్నారు. కావలి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే సహకారంతో పంటలు పండించుకున్నాం–గౌరవరం రైతులు

ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రత్యేక చొరవ చూపి పంట కాలువల్లో పూడికతీయించి సాగునీరు విడుదల చేయించడంతో ఈ దఫా పంటలు పండించుకోగలిగాం. గ్రామంలోనూ ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఏళ్ల నాటి తుప్పుపట్టిన ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చడంతో పాటు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించారు. ఈ దఫా అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా రామిరెడ్డినే గెలిపించుకుంటాం.

కలలో కూడా ఊహించలేదు –జువ్వలదిన్నె మత్స్యకారులు

జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటును మేం కలలో కూడా ఊహించలేదు. ఎన్నికలకు ముందు నాయకులు హామీలు ఇస్తుంటారు.. అన్నీ చేస్తారా అనుకున్నామే తప్ప ఎమ్మెల్యే పట్టుబట్టి పూర్తి చేయిస్తారని అనుకోలేదు. ఇప్పటి వరకు ఫిషింగ్ హార్బర్ లేని కారణంగా మత్స్యసంపదను దళారులు చెప్పిన ధరకే విక్రయించేవాళ్లం. సముద్రానికి ఎంత ఎదురీదినా సంపాదన అంతంత మాత్రంగా ఉండేది. ఇప్పుడు ఈ కష్టాలన్నీ తీరిపోయినట్లే. ఫిషింగ్ హార్బర్ ద్వారా మా జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

సీఎం వైఎస్ జగన్ పాలన చరిత్రాత్మకం

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన చరిత్రాత్మకంగా నిలిచిపోతుందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బీకేఅగ్రహారంలో విజయసంకల్ప యాత్రను ఆదివారం ఆయన నిర్వహించారు. తొలుత ఆయనకు భారీ బైక్‌ర్యాలీతో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం గ్రామానికి చేరుకున్న మేకపాటి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కొనే దమ్ములేక చంద్రబాబు జనసేన, బీజేపీతో పొత్తులు పెట్టుకున్నారన్నారు. ఎన్ని పార్టీలతో కలిసి వచ్చిన టీడీపీకి ఓటమి తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా గడపగడపకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. అందుకే ఏ ఇంటికి వెళ్లినా ప్రతి నోటా మళ్లీ జగనన్నే సీఎం అనే మాట వినిపిస్తుందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలను మభ్యపెట్టేందుకు మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నాడని విమర్శించారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలన, ఐదేళ్ల జగన్ పాలనను ప్రజలు గమనించి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఉదయగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు పొలవల్లి మాలకొండారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, నాయకులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, రావి ప్రసాద్‌నాయుడు, తమ్మినేని సతీష్‌నాయుడు, బీకేఅగ్రహారం నాయకులు దేవరపల్లి రఘురామిరెడ్డి, బండారు సురేష్‌రెడ్డి, బండారు శ్రీనివాసులరెడ్డి, దేవరపల్లి శ్రీనివాసులరెడ్డి, పులిం రవీంద్రరెడ్డి, వంగవరపు బ్రదర్స్, ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



ఘటనా స్థలంలో యువకుడికి సెలైన్ ఎక్కిస్తున్న 108 సిబ్బంది

మనుబోలు: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు ఆస్పత్రికి తరలించి కాపాడారు. రైల్వే పోలీసుల వివరాల మేరకు..మనుబోలు పరిధిలోని దువ్వూరు డొంక సమీపంలోని వంతెన వద్ద ఆదివారం ముళ్ల పొదల్లో ఓ యువకుడు గాయపడి ఉండడాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువకుడి జేబులోని గుర్తింపు కార్డు ఆధారంగా పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన హసన్ ఉల్ మౌలానాగా గుర్తించారు. చెన్నైలో ఉద్యోగం చేస్తూ కోల్‌కతా నుంచి వచ్చే క్రమంలో రైల్లో డోర్ వద్ద కూర్చుని ప్రయాణిస్తూ నిద్ర మత్తులోకి జారుకుని జారిపడిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడికి 108 వాహన సిబ్బందితో సాయంతో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరు తరలించారు.

నగదు అపహరణ కేసులో ఇద్దరి నిందితుల అరెస్ట్

అనుమసముద్రంపేట: ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీకి చెందిన ఉద్యోగి నుంచి నగదును అపహరించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌పేట ఎస్సై ప్రసాద్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీకి చెందిన ఉద్యోగి పెంచలయ్య నగదు కలెక్ట్ చేసుకుని ఈ నెల 6వ తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో రాజవోలు రోడ్డులో వెళ్తుండగా అటవీ ప్రాంతం వద్ద మోటార్‌బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. అతని వద్ద నున్న రూ.2లక్షల నగదు బ్యాగును లాక్కుని పరారయ్యారు. పెంచలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆత్మకూరు చెందిన సుబ్రహ్మణ్యం, షాకీర్‌తో పాటు మరో వ్యక్తిని నిందితులుగా గుర్తించారు. శనివారం రాత్రి రాజవోలు–ఏఎస్‌పేట అడ్డరోడ్డు వద్ద సుబ్రహ్మణ్యం,షాకీర్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై చెప్పారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry.9381287629 [T-4975]

COACHING

■APRJC, Polytechnic, IIT & NEET Foundation Classes Starts Soon. Govt. స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ఫీజు నందు ప్రత్యేక రాయితీ కలదు. సంప్ర.9849978802. [NA-6303]

REAL ESTATE

LAND FOR SALE

■ధనలక్ష్మీపురం కాకుపల్లి సెంటర్ నుండి 2 km దూరంలో 25 సెంట్లు భూమి అమ్మబడును. (With Farm House) వివరాలకు సంప్రదించండి : 70862 31356. [NA-23229]

■గూడూరు To అరిమేనుపాడు మెయిన్ రోడ్‌కి 80 ఎకరాలలో 10సం॥ల మామిడి తోట మరియు సపోటా తోట ఎకరా 20లక్షలకు అమ్మబడును. సంప్రదించండి: 93908 45455, 63037 24464. [NA-23227]

PLOT FOR SALE

■స్టోన్‌హౌస్‌పేట లక్ష్మీపురం నందు దక్షిణం ఫేసింగ్ కల్గిన 27 అం॥ల స్థలం అమ్మబడును. వివరములకు సంప్రదించండి: 83093 04379. [NA-23235]

■నెల్లూరుకి దగ్గరలో, ఆమంచర్ల మెయిన్‌రోడ్‌లో నుడా అప్రూవల్‌గా ప్లాట్స్ కలవు. అం॥ 50 వేలు బ్యాంకు లోన్ సౌకర్యం, స్పాట్ రిజిస్ట్రేషన్ పూర్తి డెవలప్‌మెంట్,వాయిదాపద్ధతికలవు.9908836056. [NA-23232]

■నెల్లూరు To జొన్నవాడ రోడ్డు పొట్టేపాళెంకు దగ్గరలో గోడౌన్‌కు/ఇన్వెస్ట్‌మెంట్‌కు అనువైన 100 అం॥లు స్థలం అమ్మబడును. వివరములకు సంప్రదించండి: 83093 04379. [NA-23230]

■నేషనల్ హైవే, గురువింద పూడి, పోర్ట్ లైన్, కాఫీడే ప్రక్కన, సత్యంజీ హైవే సిటీ అం॥ 21వేలు, 16 1/2 అం॥ 3లక్షల46వేలు, లిమిటెడ్ ప్లాట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర: 99088 36056. [NA-23222]

SERVICES

TAILORING

■మీకు టైలరింగ్ వచ్చా! మీ ఇంటి వద్దే ! మిషన్ కల్గి వుంటే నెలకు 12-23 వేల వరకు సంపాదన. మా ఫ్యాక్టరీలో నైటీలు, నైట్ డ్రస్సులు కుట్టవలెను. హోల్‌సేల్‌గా అమ్ముకోవచ్చును. 94406 40514. [NA-23238]

WANTED

■Required Experienced & Qualified (ANM / GNM) Staff Nurses (M/F) & Lab Technician(M/F). Contact : 9346239239. [NA-11026]

■In Nellore Location Share Market (Stock Market) & Mutual Funds Trainer (Faculty), Telecallers (Female) Required. For Experienced Person Preference will be given. 9110553735. [NA-6308]

■Wanted Exp. Lady Telecallers for ENGG-College Admissions. Qlf: B.Tech or Any Degree. Job Location : Nellore. Good Salary + Incentives. 80195 39539, 82470 34125. [NA-23251]

■Wardens & Electrician Required For Boys Hostels Chennai. Intermediate Pass or Any Degree. Free Food & Accommodation. Sal: 12k - 15k. Electrician (15k- 17k). Ph: 9440551454 [HA-13618]

■Wanted Male Marketing Vice Principals Age Limit 25 to 45 Years, Female Telecallers and Hostel Incharges Age Limit: 21 to 45 Years. Qualification Any Degree, Salary: Negotiable. Location: Nellore. Contact: 92487 33309 [G-5166]

■ఆంధ్ర కుట్టుమిషన్స్ కంపెనీ Trunk Road, Nellore. Opp. R.S.Brothers Job : Females. Age: 30Y Below. Salary: 10,000/-. Contact: 99494 03526. [N-1249443]

■ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లి పేమెంట్స్ Rs. 3500/- ✆ 9502615217, 9059663584 [G-8577]

■నెల్లూరు హరినాథపురంలో ఇంటిలో ఉదయాన్నే వంట చేయుటకు బ్రాహ్మణ ఆడ మనిషి కావలెను. ఈ నెంబర్‌కి సాయంత్రం 6గం॥ల తరువాత ఫోన్ చేయండి. 94924 15346. [N-1249475]

■ప్రముఖ యునివర్సిటిలో వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. జీతం: 10K-15K. Work From Office. వివరములకు సంప్రదించండి: 96664 47763. [N-1189998]

■నెల్లూరు టౌన్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సైట్‌లో టెలికాలింగ్ చేయుటకు లేడీ/జెంట్స్ టెలికాలర్స్ కావలెను. వివరములకు సంప్రదించండి: 86393 30705, 99480 58617. [NA-23244]

■శ్రీ దుర్గా పికెల్స్ ఫ్యాక్టరీలో ప్యాకింగ్ మిషన్ వద్ద ప్యాకింగ్ చేయుటకు (మహిళలు) & హెల్పర్స్ (మగవారు) కావలెను. 6వమైలు, దేవిస్‌పేట, మైపాడురోడ్డు, నెల్లూరు. 91005 74129, 76759 74297. [NA-5328]

■Lotus Hospital నందు పని చేయుటకు అనుభవం గల ANM, GNM & B.Sc నర్సింగ్ స్టాఫ్ Exp. గల మరియు BAMS, Doct కావలెను. వివరములకు సంప్రదించండి: 91212 82909. [NA-11026]

■సెక్యూరిటీ గార్డ్స్ Field Officers కావలెను. 12గం॥ల డ్యూటీ 45సం॥ల లోపు వయస్సు ఉండాలి. మగవారు మాత్రమే. వివరములకు సంప్రదించండి: 7288004466, 7288004477. [NA-11670]

■మెడికల్ షాపులో పని చేయుటకు సీనియర్ & జూనియర్ స్టాఫ్, కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్, క్యాషియర్, డెలివరి బాయ్ కావలెను.96185 39314, 88866 60646. [NA-522]

■నెల్లూరులో షేర్ మార్కెట్ (స్టాక్ మార్కెట్) మ్యూచువల్ ఫండ్స్ ట్రైనర్, టెలికాలర్స్ (F) ఫుల్ / పార్ట్ టైం కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. సెల్: 91105 53735. [NA-6307]

■శ్రీ మ్యారేజ్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. అడ్రస్: కొండాయపాళెం గేట్ ఎదురువీధి, నెల్లూరు. సంప్రదించండి: 94405 67277, 88855 67277, 89850 48177. [NA-6306]

■JCమొబైల్ షోరూం, VRC సెంటర్, నెల్లూరు నందు పని చేయుటకు సేల్స్ గర్ల్స్ కావలెను. జీతం:12,000/-+ ఇన్సెంటివ్స్. వివరములకు సంప్రదించండి:9704178633, 8297863969. [NA-6302]

■Bajaj Finse Auth Agency నందు పని చేయుటకు DRA Certificate గల Recovery Executives కావలెను. Salary: 16000 + ఇన్సెంటివ్ + అలవెన్స్.సంప్ర: 8985696117, 63034 03389. [NA-6304]

■నెల్లూరు,VRCసెంటర్ దగ్గర గల అక్షర ఎడ్యుకేషనల్ సర్వీస్ నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Exp:0-3 Yrs, Qlf: Degree, MBA, B.Tech. Sal : 12,000 to 15,000. Ph: 92465 60000. [NA-6305]

■ప్రముఖ సెక్యూరిటీ కంపెనీకి నెల్లూరు, నాయుడుపేట, కలిచేడులకు S/G, సూపర్‌వైజర్స్, ASOలు అర్జెంట్‌గా కావలెను. భోజనం, జీతం 12వేలు నుండి 15వేలు. 70137 77643, 91103 39912. [NA-23231]

■Secur Security Services నెల్లూరు, ధామవరం & నారాయణరెడ్డిపేట ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ ASO లు, గార్డ్స్ కావలెను. సంప్రదించండి: 99595 98279. [NA-23225]

■గూడ్స్ ఆటో, TATA ACE కి అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగిన డ్రైవర్లు కావలెను. (Qlf: 10th / Inter) శ్రీ దుర్గా ఫుడ్స్, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 95437 58005. [NA-5324]

■ఫెయిత్ డా॥ రమణి, BPT, MIAP, 10th చదివిన అమ్మాయిలు, ఫిజియో అసిస్టెంట్లుగా, ఆయా కావలెను. మధురా స్వీట్స్ ఎదురు వీధి, బృందావనం2వ వీధి,నెల్లూరు.92464 65433. [NA-23206]

■BM రెడ్డి పెట్రోల్‌బంకు పొదలకూరు రోడ్డు, నెల్లూరు నందు పని చేయుటకు బాయ్స్, గర్ల్స్ కావలెను. మంచి జీతం. నెల్లూరుటౌన్ మరియు పరిసర ప్రాంతాలవారు సంప్ర: 94402 78152. [NA-515]

■ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233892]

■కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: +91 7995984445 [HA-96889]

■ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 20k ఫోన్: 8977639662 / 8977639663 [H-799855]

■R.S Chakravarthi Educational Consultancy Office నెల్లూరు నందు పనిచేయుటకు అకాడమిక్ కౌన్సిలర్స్-10No, Lady Telecallers -30No. కావలెను. Qlf : Any Degree, Sal: 15K to 20K+ఇన్సెంటివ్స్. Fixed Salary. 96400 60006. [NA-23237]

■నెల్లూరు సిటీలో ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు 40సం॥లోపు అనుభవం కలిగిన అకౌంటెంట్స్ (జెంట్స్) 5మంది కావలెను. 30K Salary. (9.00am to 8.00pm). వివరములకు సంప్రదించండి:94921 93133. [NA-23236]

■లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Qlf: ఏదైనా డిగ్రీ, మంచి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. సంప్ర: డా॥ ఆండాల్స్ లక్ష్మీ ఫెర్టిలిటీ సెంటర్, S2సినిమా హాల్స్ దగ్గర, పొగతోట, నెల్లూరు. 99088 54316, 0861-2328914. [NA-2628]

■కంప్యూటర్ ఆపరేటర్ (Female & Unmarried) కావలెను. ఇంగ్లీష్, మ్యాథ్స్‌లో ప్రావీణ్యత వుండవలెను. ప్రారంభంలో 1 నెల ట్రైనింగ్. నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ దగ్గరలోని మా ఆఫీస్ నందు జరుగును. శాలరీ : 10,000/-. సంప్ర: 99636 30236. [NA-521]

■ఫైనాన్స్ కంపెనీలో నెల్లూరు, రాజుపాలెం, ఇందుకూరుపేట, కావలి, కోవూరు, సూళ్లూరుపేట, గూడూరులలో పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ / సిసింగ్ & నెల్లూరు టౌన్ లో లేడీ టెలి కాలర్స్ కావలెను. 9392915947 / 9392915944 [HA-1379]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.